సాక్షి హనుమకొండ

మంగళవారం | 8 | ఆగస్టు | 2023



9నుంచి ఎస్‌డీఎల్‌సీఈ పరీక్షలు

కేయూ పరిధిలోని ఎస్‌డీఎల్‌సీఈ డిగ్రీ బీఏ, బీకాం, బీబీఏ, బీఎస్సీ కోర్సుల మొదటి, ద్వితీయ, ఫైనలియర్ పరీక్షలు ఈనెల 9వ తేదీ నుంచి నిర్వహిచనున్నారు. - 8లో



స్టైఫండ్ పెంచాల్సిందే..

ప్రభుత్వం తమకు స్టైఫండ్ పెంచాల్సిందేనని వరంగల్ ప్రభుత్వ ఆయుర్వేద వైద్య విద్యార్థులు బోధన వైద్యశాల, వైద్య కళాశాల ఎదుట ధర్నా నిర్వహించారు. - 8లో

గరిష్టం/కనిష్టం
$33^0/25^0$

వాతావరణం

జిల్లాలో వాతావరణం పొడిగా ఉంటుంది. మధ్యాహ్నం ఉష్ణోగ్రతలు మామూలుగా ఉంటాయి. పలు చోట్ల చిరు జల్లులు కురిసే అవకాశం ఉంది.

న్యూస్‌రీల్

డీఎండబ్ల్యూఓలుగా డిప్యూటీ కలెక్టర్‌లు ?

న్యూశాయంపేట: మైనారిటీ సంక్షేమ శాఖ ప్రక్షాళనలో భాగంగా జిల్లా మైనారిటీ సంక్షేమ శాఖ అధికారులుగా(డీఎండబ్ల్యూఓ) రాష్ట్ర వ్యాప్తంగా ఇటీవల తహసీల్దార్‌ల నుంచి డిప్యూటీ కలెక్టర్‌లుగా పదోన్నతి పొందిన వారిని ప్రభుత్వం నియమించనున్నట్లు సమాచారం. ఇందులో భాగంగా వరంగల్, హనుమకొండ జిల్లాల్లో ఏదైనా ఒక జిల్లాకు పదోన్నతి పొందిన డిప్యూటీ కలెక్టర్ ఉమారాణిని నియమించనున్నట్లు తెలుస్తోంది. ఒకటి, రెండు రోజుల్లో అధికారిక ఉత్తర్వులు వెలువడుతాయని ఆ శాఖ వర్గాలు పేర్కొంటున్నాయి.

గ్రూప్-2కు ఉచిత శిక్షణ

న్యూశాయంపేట: తెలంగాణ పబ్లిక్ సర్వీస్ కమిషన్ నిర్వహించే గ్రూప్-2 పరీక్షకు దరఖాస్తు చేసుకున్న మైనార్టీ అభ్యర్థులకు ఉచితంగా కోచింగ్ ఇవ్వనున్నట్లు హనుమకొండ జిల్లా మైనార్టీ సంక్షేమాధికారి మేన శ్రీను సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. శిక్షణ పొందాలనుకునే అభ్యర్థులు ఫుల్ లెంత్ మాక్ టెస్ట్‌లో పాల్గొనేందుకు ఆన్‌లైన్ గూగుల్ ఫాం ద్వారా దరఖాస్తులు సమర్పించాలని తెలిపారు.

వైన్స్ దరఖాస్తులు

కాజీపేట అర్బన్: వైన్స్ టెండర్ల దరఖాస్తులు సోమవారం జోరందుకున్నాయి. వరంగల్ అర్బన్ పరిధిలోని ఖిలావరంగల్‌కు 8 దరఖాస్తులు, వరంగల్ అర్బన్‌కు 13, హనుమకొండ ఎక్సైజ్ స్టేషన్ పరిధిలోకి ఒక దరఖాస్తు వచ్చాయి. హనుమకొండ ఎక్సైజ్ స్టేషన్ ఇన్‌స్పెక్టర్ రామకృష్ణ స్వీకరించారు. ఇప్పటివరకు మొత్తం 22 దరఖాస్తులు వచ్చాయి. కాగా కాజీపేట ఎక్సైజ్ స్టేషన్ పరిధిలో ఒక్క దరఖాస్తు రాకపోవడం గమనార్హం.

వినతులు పరిష్కరించాలి



హన్మకొండ అర్బన్: ప్రజావాణిలో ప్రజలనుంచి స్వీకరించిన వినతులు సత్వరమే పరిష్కరించాలని హనుమకొండ కలెక్టర్ సిక్తా పట్నాయక్ అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్‌లో నిర్వహించిన గ్రీవెన్స్ సెల్‌కు ఆమె హాజరై ప్రజల నుంచి వినతులు స్వీకరించారు. ఈడీ ఎస్సీ కార్పొరేషన్ 19, నోడల్ ఆఫీసర్ డబుల్ బెడ్రూం ఇళ్లు 09, కమిషనర్ జీడబ్ల్యూఎంసీ 07, ఆర్డీఓ హనుమకొండ 06లతో పాటు వివిధ శాఖలకు సంబంధించిన మొత్తం 109 వినతులను స్వీకరించినట్లు తెలిపారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ మహేందర్ జీ, డీఆర్‌డీఓ శ్రీనివాస కుమార్, వివిధ శాఖల ఉన్నతాధికారులు, తదితరులు పాల్గొన్నారు.

యువత రచనలు చేయాలి

అంపశయ్య నవీన్



హన్మకొండ కల్చరల్ : సాంకేతిక పరిజ్ఞానం అభివృద్ధి చెందిన ఈ రోజుల్లో యువత తీరికలేకుండా ఉన్నా.. రచనలు చేయడం మరిచిపోవద్దని ప్రముఖ నవలా రచయిత, కేంద్ర సాహిత్య అకాడమీ పురస్కార గ్రహీత అంపశయ్య నవీన్ అన్నారు. హనుమకొండ వడ్డేపల్లిరోడ్‌లోని పీఆర్ రెడ్డి ఫంక్షన్‌హాల్‌లో వరంగల్ సహృదయ సాహిత్య సాంస్కృతిక సంస్థ ఆధ్వర్యంలో నాలుగురోజుల పాటు జరుగుతున్న సాహిత్యోత్సవాలు సోమవారం సాయంత్రం ముగిసాయి. చివరిరోజు కార్యక్రమంలో భాగంగా సహృదయ అధ్యక్షుడు గన్నమరాజు గిరిజామనోహరబాబు అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో ముఖ్య అతిథిగా అంపశయ్య నవీన్, విశిష్ట అతిథులుగా సాహితీవేత్త గంటా రామిరెడ్డి, మాధవి, రాధిక పాల్గొన్నారు. ముందుగా జ్యోతిప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. అనంతరం దివంగత వే.నరసింహారెడ్డి రచించిన 'సవిత'కవిత సంకలనాన్ని ఆవిష్కరించారు. సహృదయ కార్యదర్శి కుందావజ్జుల కృష్ణమూర్తి సంయోజకులుగా వ్యవహరించారు. కార్యక్రమంలో కాళోజీ ఫౌండేషన్ అధ్యక్ష,కార్యదర్శులు నాగిళ్ల రామశాస్త్రి, వీఆర్ విద్యార్థి, సభ్యులు పాల్గొన్నారు.

అవయవదానంపై అవగాహన

ఎంజీఎం: అవయవ, నేత్ర, శరీరదానంపై ప్రజలు అవగాహన కలిగి ఉండాలని ఎంజీఎం సూపరింటెండెంట్ డాక్టర్ చంద్రశేఖర్ అన్నారు. తెలంగాణ నేత్ర అవయవ శరీర దాతల అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న జాతీయ అవయవదాన వారోత్సవాల ఫ్లెక్సీని సూపరింటెండెంట్ సోమవారం ఆవిష్కరించి, మాట్లాడారు. కార్యక్రమంలో అసోసియేషన్ అధ్యక్షుడు కొండెడ్డి మల్లారెడ్డి, ఆడెపు రాజేంద్రప్రసాద్, వారణాసి మోహన్ పాల్గొన్నారు.

తాపీమేస్త్రీ కూతురు సివిల్ ఎస్సైగా..

మడికొండ: కాజీపేట మండలం మడికొండ గ్రామానికి చెందిన వస్కుల రాంచందర్, వనజ దంపతుల కూతురు మనీషా సివిల్ ఎస్సైగా ఎంపికయ్యారు. మనీషా తండ్రి తాపీమేస్త్రీ పనిచేస్తుండగా.. తల్లి మహిళా సంఘాల్లో సీఏగా పనిచేస్తున్నారు. మనీషా చిన్నప్పటినుంచి బాగా చదువుతుండేది. పోలీస్ ఈవెంట్లలోనూ ఉత్తమ ప్రతిభ కనబర్చింది. తొలి ప్రయత్నంలోనే ఎస్సైగా ఎంపికవడం ఆనందంగా ఉందని మనీషా తెలిపారు. కాగా, మనీషాను గ్రామస్తులు అభినందించారు. కూతురు తమ నమ్మకాన్ని నిలబెట్టిందని తల్లిదండ్రులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు.



మనీషా

ఉమ్మడి జిల్లాలో పోలీస్ ఉద్యోగాలు సాధించిన అభ్యర్థుల కథనాలు.. 8లో

అర్హులందరికీ ప్రభుత్వ పథకాలు

హన్మకొండ అర్బన్ : జిల్లాలో అర్హులైన ప్రతి ఒక్కరికీ ప్రభుత్వ పథకాలు అందేలా చర్యలు తీసుకుంటున్నామని కలెక్టర్ సిక్తా పట్నాయక్ అన్నారు. రాష్ట్ర ప్రధాన కార్యదర్శి శాంతికుమారి ప్రభుత్వ సంక్షేమ, అభివృద్ధి పథకాల అమలు తీరుపై జిల్లా కలెక్టర్, ఉన్నతాధికారులతో సోమవారం వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ సిక్తా పట్నాయక్ మాట్లాడుతూ.. హరితహారం లక్ష్యాల మేరకు నిర్ణీత గడువులోగా పూర్తి చేసేందుకు అవసరమైన చర్యలు తీసుకున్నట్లు తెలిపారు. గొర్రెల పంపిణీ, బీసీ కుల వృత్తుల రూ.లక్ష సాయంలో లబ్ధిదారుల ఎంపిక పూర్తయిందని నిర్దేశించిన లక్ష్యం మేరకు యూనిట్లు పంపిణీ చేస్తామన్నారు. గృహలక్ష్మి పథకం కోసం జిల్లాలోని తహసీల్దార్ కార్యాలయాలు, మున్సిపల్ కార్యాలయం, కలెక్టరేట్‌లో ప్రత్యేక కౌంటర్లు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఆన్‌లైన్ మీసేవ ద్వారా నోటరీ భూముల క్రమబద్ధీకరణకు దరఖాస్తులు స్వీకరిస్తున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ మహేందర్‌జీ, డీఎఫ్ఓ వసంత లావణ్య, డీఆర్‌డీఓ పీడీ శ్రీనివాస్‌కుమార్, తదితరులు పాల్గొన్నారు.



వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న కలెక్టర్ సిక్తా పట్నాయక్, అధికారులు

ఎన్‌జీటీకి 'భద్రకాళి' ఆక్రమణలు!

చెరువు విస్తీర్ణం 621ఎకరాలు.. ప్రస్తుతమున్నది 281ఎకరాలే

- గొలుసుకట్టు చెరువులపైనా ఎన్‌జీటీలో పిటిషన్
- ఓరుగల్లు ముంపునకు ఆక్రమణలే కారణం
- చర్చనీయాంశంగా మారిన చెరువుల కబ్జా వ్యవహారం



వరదలో మునిగిన భద్రకాళి చెరువు చుట్టూ ఎఫ్‌టీఎల్ పరిధిలో నిర్మించిన బండ్, భవనాలు (ఫైల్)

సాక్షిప్రతినిధి, వరంగల్: కాకతీయుల గొలుసుకట్టు చెరువుల ఆక్రమణల పర్వం నేషనల్ గ్రీన్ ట్రిబ్యునల్ (ఎన్‌జీటీ)కు చేరింది. భద్రకాళి చెరువుతోపాటు ఆరు చెరువుల ఆక్రమణలపై సోమవారం చెన్నైలోని ఎన్‌జీటీ కార్యాలయంలో పిటిషన్ దాఖలైంది. ఇప్పటికే చెరువుల ఆక్రమణల బాగోతంపై లోకాయుక్త సైతం విచారణ జరుపుతోంది. సుమారు పదేళ్లుగా ఆక్రమణలు వివాదాస్పదంగా మారిన సమయంలో కలెక్టర్లు, మున్సిపల్ కమిషనర్‌లు విచారణ చేపట్టినా.. రాజకీయ ఒత్తిళ్ల కారణంగా అటకెక్కుతున్నాయి. 2013 నుంచి ఇదే తంతు జరుగుతుండగా.. ఇటీవల కురిసిన వర్షాలకు ఏకంగా భద్రకాళి చెరువుకు గండి పడిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో వినియోగదారుల మండలి రాష్ట్ర ప్రతినిధులు సాంబరాజు చక్రపాణి, మొగిలిచర్ల సుదర్శన్‌లు చెన్నైలోని నేషనల్ గ్రీన్ ట్రిబ్యునల్‌లో భద్రకాళి చెరువు ఆక్రమణలు, అందుకు బాధ్యులు, వివిధ శాఖల అధికారుల నిర్లక్ష్యంపై ఫిర్యాదు చేయడం కలకలంగా మారింది.

ఎనిమిదేళ్ల కిందటే రద్దుకు నిర్ణయం..

2015లో అప్పటి వరంగల్ జిల్లా కలెక్టర్ వాకాటి కరుణ జిల్లాలో చెరువుల కబ్జాను అరికట్టడానికి స్ట్రైకింగ్ ఫోర్స్‌ను ఏర్పాటు చేశారు. అప్పటి మేయర్ నన్నపునేని నరేందర్, మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ సర్ఫరాజ్ అహ్మద్ లు భద్రకాళి చెరువులో అక్రమ నిర్మాణాలకు కేటాయించిన ఇంటినంబర్‌లను రద్దు చేస్తామని కౌన్సిల్ మీటింగ్‌లో ప్రకటించారు. చెరువులో ఎటువంటి అక్రమ నిర్మాణాలు లేకుండా చర్యలు చేపడతామని, 2016లో అప్పటి ఉమ్మడి రాష్ట్రాల లోకాయుక్త సంస్థలో వరంగల్ మున్సిపల్ కార్పొరేషన్ అధికారులు హామీ ఇచ్చారు. కానీ ఏ ఒక్కరూ ఎటువంటి అక్రమ కబ్జాలను అరికట్టలేదు. మున్సిపల్ కార్పొరేషన్ ఏ ఒక్క ఇంటి నంబర్ రద్దు చేయలేదు. ఈ క్రమంలో 621 ఎకరాల విస్తీర్ణం ఉన్న భద్రకాళి చెరువు 281 ఎకరాల విస్తీర్ణం వరకు చేరింది. బిల్డింగ్ రూల్స్ 2012 రూల్ (3) (ఏ) (1) (2) ల ప్రకారం 10 హెక్టార్లు, ఆపై ఎక్కువ విస్తీర్ణం గల చెరువుల ఎఫ్‌టీఎల్ పరిధికి 30 మీటర్ల దూరంలో మాత్రమే నిర్మాణాలకు స్థానిక సంస్థలు, కార్పొరేషన్ లు అనుమతించాలి. కానీ వరంగల్ భద్రకాళీ చెరువు ఎఫ్‌టీఎల్ పరిధి లోపలనే బిల్డింగులు, అపార్ట్ మెంట్‌లకు మున్సిపల్ కార్పొరేషన్ ఇంటి నంబర్‌లు ఇచ్చి ఆమోదం తెలిపింది. స్వయంగా ప్రభుత్వ సంస్థలే చెరువు మధ్యలో మినీ ట్యాంక్ బండ్ అభివృద్ధి పేరిట నిర్మాణాలకు అనుమతులు ఇచ్చింది. వీటన్నింటిపై దాఖలైన పిటిషన్‌పై ఎన్‌జీటీ ఎలా స్పందిస్తుందో? అనే అంశం అన్ని వర్గాలను కలవరపెడుతోంది.

'ఎన్‌జీటీ'లో ఫిర్యాదు ముఖ్యాంశాలు ఇవే...

వరంగల్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో ఉన్న భద్రకాళి చెరువు మొత్తం విస్తీర్ణం 621 ఎకరాలు. ప్రస్తుతం 281 ఎకరాలు మాత్రమే ఉంది.. ఈ చెరువుకు ఎఫ్‌టీఎల్ హద్దులు నిర్ణయం జరిగినా కూడా, కబ్జా జరగడం, ఎఫ్‌టీఎల్ పరిధి లోపలనే బిల్డింగులు, అపార్ట్‌మెంటులు, మినీ టాంక్ బండ్ నిర్మాణాలు జరిగాయి. వీటికి గ్రేటర్ వరంగల్ మున్సిపల్ కార్పొరేషన్, కాకతీయ అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీలు అనుమతించాయని ఎన్‌జీటీకి ఫిర్యాదు అందింది. చెరువుతోపాటు ములుగు రోడ్ కోట చెరువు, న్యూ శాయంపేట కోట చెరువు, చిన్న వడ్డేపల్లి చెరువు, రంగ సముద్రం, కాజీపేట బంధం చెరువులకు 2013 ఎఫ్‌టీఎల్ హద్దులు నిర్ణయం జరిగినా.. భద్రకాళి చెరువులో 2015 లో 'కుడా'4.5 కిలోమీటర్ల పొడవులో రూ.15 కోట్ల ఖర్చుతో, ఎఫ్‌టీఎల్ పరిధిలో మినీ ట్యాంక్ బండ్ అభివృద్ధి పనులు ప్రారంభించారని ఫిర్యాదులో పేర్కొన్నారు.

వరంగల్ నగరాన్ని పరిరక్షించండి

వరంగల్ మహానగరం వరదలకు ముంపునకు గురి కావడానికి చెరువులు, నాలాల ఆక్రమణలే కారణం. మొత్తం పది సర్వేనంబర్ల విస్తీర్ణంలో ఉన్న భద్రకాళి చెరువు ఎఫ్‌టీఎల్ పరిధిలోని అక్రమ నిర్మాణాలు తొలగించాలని ఎన్‌జీటీలో ఫిర్యాదు చేశాం. బిల్డింగ్ రూల్స్ 2012కు విరుద్ధంగా చెరువులో నిర్మాణం జరిగిన మినీ ట్యాంక్ బండ్ (భద్రకాళీ బండ్) తొలగించేందుకు వరంగల్, హనుమకొండ జిల్లాల కలెక్టర్లు, మున్సిపల్ కమిషనర్, ఇరిగేషన్ చీఫ్ ఇంజినీరు, కుడా, పర్యావరణశాఖ అధికారులను ఆదేశించాలని కోరాం.

- సాంబరాజు చక్రపాణి, రాష్ట్ర ప్రతినిధి, వినియోగదారుల మండలి

పెద్ద సార్ వచ్చినా.. సిబ్బంది రారు

ఎంజీఎంలో గాడి తప్పుతున్న పాలన

- ఉదయం 11 దాటినా విధులకు హాజరు కాని సిబ్బంది
- సేవల కోసం రోగుల ఎదురుచూపులు
- సాక్షి విజిట్‌లో వాస్తవాలు వెలుగులోకి..



10.50 గంటల వరకు విధులకు హాజరు కాని స్టోర్స్ సిబ్బంది



10.55 వరకు తెరుచుకోని ఆరోగ్యశ్రీ కార్యాలయం

ఎంజీఎం : వరంగల్ ఎంజీఎం ఆస్పత్రి పాలన గాడితప్పుతోంది. ఆస్పత్రికి కొంత మంది వైద్యులు చుట్టపుచూపుగా వస్తున్న క్రమంలో.. ఈ ఆనవాయితీ మరికొంత మంది వైద్యసిబ్బందికి, మినిస్టీరియల్ సిబ్బందికి సైతం పాకింది. సోమవారం ఉదయం 'సాక్షి' ఎంజీఎం ఆస్పత్రిలోని ప్రధాన కార్యాలయాలను పరిశీలించగా 11 గంటలు దాటినా మినిస్టీరియల్ సిబ్బంది విధులకు రాని పరిస్థితులు కనిపించాయి.

ఆస్పత్రిలోని విభాగాల్లో పరిస్థితి..

సోమవారం ఉదయం 10 గంటలకే ఎంజీఎం సూపరింటెండెంట్ డాక్టర్ చంద్రశేఖర్ విధులకు హాజరయ్యారు. ఆయన కింద పనిచేసే కొంతమంది వైద్యులు, మినిస్టీరియల్ ఉద్యోగులు 11 గంటలు దాటినా విధులకు హాజరు కాలేదు. ఈ సమయంలో ఆరోగ్య శ్రీ కార్యాలయం తాళం తీయలేదు. ఆస్పత్రి నుంచి డిశ్చార్జ్ అయ్యి రవాణా చార్జీల కోసం రోగుల బంధుమిత్రులు ఎదురుచూడడం కనిపించింది. ఆస్పత్రిలో ఏడీగా విధులు నిర్వర్తిస్తున్న అధికారి విధులకు ఎప్పుడు వస్తారో తెలియని పరిస్థితి..

పత్తాలేని స్టోర్స్ సిబ్బంది..

ఎంజీఎం ఆస్పత్రిలో పరిపాలన సౌలభ్యం కోసం ప్లానింగ్, స్టోర్స్, అకౌంట్స్‌గా విభజించారు. 10.50 గంటల ప్రాంతంలో స్టోర్స్ విభాగాన్ని పరిశీలించగా ముగ్గురు సిబ్బంది విధులకు హాజరు కావాల్సి ఉండగా ఏ ఒక్కరూ రాలేదు.

రవాణా చార్జీల కోసం ఎదురుచూస్తున్నా



నా భర్తకు ఆస్పత్రిలో ఆపరేషన్ చేశారు. ఈ రోజు డిశ్చార్జ్ చేశారు.. మందులు ఇచ్చారు. ఊరికి పోయేందుకు ఆరోగ్య శ్రీ కార్యాలయంలో రవాణా చార్జీలు ఇస్తామన్నారు. 11 అవుతుంది.. ఇంకా సార్లు ఎవరూ రాలేదు.

- కొమురమ్మ

గణితంపై పట్టుసాధించేలా బోధించాలి

డీఈఓ అబ్దుల్ హై



విద్యారణ్యపురి: ప్రాథమిక గణిత భావనలపై విద్యార్థులు పట్టు సాధించాలే బోధించాలని డీఈఓ డాక్టర్ మహ్మద్ అబ్దుల్ హై ఉపాధ్యాయులకు సూచించారు. తొలిమెట్టు శిక్షణలో భాగంగా సోమవారం హనుమకొండ జిల్లాలోని 14 మండలాల్లో ఈరోజు గణిత శిక్షణ ప్రారంభమైంది. లష్కర్ బజార్ ప్రాక్టిసింగ్ ఉన్నత పాఠశాలలో నిర్వహిస్తున్న హనుమకొండ మండల స్థాయి గణిత ఉపాధ్యాయుల శిక్షణ సదస్సుకు డీఈఓ హాజరై ఉపాధ్యాయులతో మాట్లాడారు. ప్రాథమిక తరగతుల్లోనే విద్యార్థులు గణిత భావనలపై అవగాహన పొందితే పై తరగతుల్లో రాణించగలుగుతారని తెలిపారు. జిల్లా క్వాలిటీ కోఆర్డినేటర్ శ్రీనివాస్, గణిత ఉపన్యాసకులు ఎం.సోమయ్య మాట్లాడారు. గణితంలో ప్రాథమిక విద్యార్థుల సామర్థ్యాలు, భావనలు పెంచడానికి గణిత ఉపాధ్యాయులు పోషించాల్సిన పాత్రపై సోమయ్య ఉపాధ్యాయులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో కోర్సు డైరెక్టర్ ప్రసాద్, హెచ్ఎం ప్రభాకర్, రిసోర్స్ పర్సన్‌లు ఉదయ్, శ్రీపాల్‌రెడ్డి పాల్గొన్నారు.

కబ్జాలపై నీటి పారుదల, పోలీస్‌శాఖల సర్వే

నాలాలు, చెరువులపై అక్రమ నిర్మాణాల గుర్తింపు



సర్వే చేస్తున్న అధికారులు

హసన్‌పర్తి: నగరంలోని నాలాలు, చెరువుల కబ్జా గుర్తించడానికి అధికారులు ముందుకు కదిలారు. నగరం ఇటీవల వరద ముంపునకు గురి కావడానికి గల కారణాలపై నివేదిక ఇవ్వాలని రాష్ట్ర ప్రభుత్వం ఇటు కలెక్టర్, అటు నగర పోలీస్ కమిషనర్‌ను ఆదేశించింది. దీంతో సోమవారం హనుమకొండ ఏసీపీ కిరణ్‌కుమార్ అధ్యక్షతన ప్రత్యేక సమావేశం నిర్వహించారు. హనుమకొండ ఏసీపీ పరిధిలో ఉన్న పోలీస్, నీటిపారుదల శాఖ అధికారులు హాజరయ్యారు. నగరం వరద ముంపునకు గురి కావడానికి గల కారణాలు విశ్లేషించగా నాలాలు, చెరువుశిఖాల్లో నిర్మాణాలే ఇందుకు కారణమని తేలింది. దీంతో కబ్జాకు గురైన నాలాలు, చెరువు శిఖాలను గుర్తించి నివేదిక ఇవ్వాలని ఏసీపీ కిరణ్‌కుమార్ ఆదేశించారు. ఈ మేరకు ఇరుశాఖల అధికారులు సోమవారం సంయుక్తంగా సర్వే నిర్వహించారు. గోపాలపురం, పలివేల్పుల, భీమారం, జవహర్‌కాలనీ సమీపంలోని వాగు, నయీంనగర్ కాల్వపై వెలిసిన అక్రమ నిర్మాణాలను గుర్తించారు. భీమారం సమీపంలోని పెండ్లి వాగుతోపాటు పలివేల్పుల చెరువుల్లోకి వెళ్లే నాలా, ఎల్లాపురం పెద్ద చెరువు నుంచి సీతంపేట చెరువుకు వచ్చే కాల్వలు కబ్జాకు గురైనట్లు అధికారులు గుర్తించారు. కొంతమంది రియల్టర్లు నాలాలు ఆక్రమించుకుని వెంచర్ చేసినట్లు అధికారులు నివేదిక రూపొందించినట్లు తెలిసింది. కార్యక్రమంలో కేయూసీ పోలీస్ ఇన్‌స్పెక్టర్ అబ్బయ్య,ఎస్సై విజయ్‌కుమార్, ఏఈ శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

సాగు పనుల జోరు

- జిల్లాలో 79,214 ఎకరాల్లో పత్తి
- 62,035 ఎకరాల్లో వరి సాగు
- కొనసాగుతున్న వరి నాట్లు

హన్మకొండ: జిల్లాలో వానాకాలం సాగు పనుల్లో రైతులు బిజీగా మారారు. భారీ వర్షాలతో కొంత ఆటంకం కలిగినా.. ప్రస్తుతం పరిస్థితులు అనుకూలంగా ఉన్నాయి. జూన్, జూలై మొదటి పక్షం వరకు వర్షాలు సరిగా లేకపోవడంతో సాగు పనులపై రైతులు సందిగ్ధంలో పడ్డారు. కానీ, జూలై చివర్లో కురిసిన భారీ వర్షాలతో రైతుల్లో ఆశలు చిగురించాయి. వర్షాలు కొంత అతలాకుతలం చేసినా హనుమకొండ జిల్లాలో పంటలకు పెద్దగా ఇబ్బందులు కలుగలేదు. చెరువులు, కుంటలు నిండుకుండలా తొణికిసలాడుతూ.. భూగర్భ జలాలు వృద్ధి చెందాయి. దీంతో వరి నాట్లు ఊపందుకున్నాయి. హనుమకొండ జిల్లాలో ఇప్పటి వరకు 79,214 ఎకరాల్లో పత్తి సాగు చేయగా.. 62,035 ఎకరాల్లో వరి సాగు చేశారు. జిల్లాలో ఈ సీజన్‌లో అన్ని పంటలు కలిపి 2.40లక్షల ఎకరాల్లో సాగు చేస్తారని వ్యవసాయ అధికారులు అంచనా వేశారు. 2022 వానాకాలంలో 2,40,008 ఎకరాల్లో పంటలు సాగు చేశారు. 2023 వానా కాలంలో అదే స్థాయిలో సాగవుతుందని అధికారులు అంచనా వేయగా ఇప్పటి వరకు 1,45,290 ఎకరాల్లో సాగైంది. వరి గత ఏడాది 1,47,980.76 ఎకరాల్లో సాగు చేయగా ఈ వానాకాలంలో ఇప్పటి వరకు వరి 62,035 ఎకరాల్లో సాగైంది. పత్తి గత వానాకాలంలో 87,099 ఎకరాల్లో సాగు చేయగా, ఈ ఏడాది 85వేల ఎకరాల్లో సాగు చేస్తారని అంచనా వేయగా ఇప్పటి వరకు 79,914 ఎకరాల్లో సాగైంది. సమయముండడంతో సాగు పనులు కొనసాగుతున్నాయి. సోయాబీన్ 231 ఎకరాల్లో, మిరప 89 ఎకరాల్లో సాగు చేశారు.

పంటల వారీగా సాగు వివరాలు.. (సాగు ఎకరాల్లో)

పంట	గత వానాకాలం	ప్రస్తుత అంచనా	ప్రస్తుతం సాగైంది
వరి	1,47,980.76	1,50,000	62,035
మొక్కజొన్న	4,012	6,000	3470
పత్తి	87,099	85,000	79,214
నూనె గింజలు	262	300	----
పప్పు దినుసులు	654	700	251 (కంది)

స్లో లెర్నర్లపై వలంటీర్లు దృష్టిసారించాలి

రాష్ట్ర విద్యాశాఖ కార్యదర్శి వాకటి కరుణ



మాట్లాడుతున్న కేయూ వీసీ రమేష్

కేయూ క్యాంపస్: ప్రభుత్వ పాఠశాలల్లోని స్లో లెర్నర్లపై దృష్టిసారించాలి రాష్ట్ర విద్యా శాఖ కార్యదర్శి వాకాటి కరుణ సూచించారు. కేయూ సెనెట్ హాల్‌లో సోమవారం ఎన్ఎస్ఎస్ ఆధ్వర్యంలో 'పిల్లల కోసం' కార్యక్రమంలో భాగంగా వలంటీర్లు, ప్రోగ్రాం ఆఫీసర్ లకు నిర్వహించిన వర్క్ షాప్‌లో ఆన్‌లైన్‌లో ఆమె ప్రసంగించారు. ప్రాథమిక స్థాయి విద్యార్థులకు ఒక అన్నగా, అక్కగా బోధన చేయాలని వలంటీర్లను కోరారు. రీడింగ్ యాక్టివిటీ పెంచాలన్నారు. మేడారం జాతరలో కాకతీయ యూనివర్సిటీ ఎన్ఎస్ఎస్ వలంటీర్ల సేవలు మరువలేనివని అన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా 50వేల మంది వలంటీర్లను 'పిల్లల కోసం' కార్యక్రమంలో భాగస్వామ్యం చేస్తామన్నారు. పాల్గొన్న వలంటీర్లకు ప్రత్యేక సర్టిఫికెట్ అందచేస్తామని తెలిపారు. ఈసందర్భంగా కేయూ వీసీ రమేష్ మాట్లాడుతూ.. యవత తలచుకుంటే సాధించలేనిది అంటూ ఏమీ లేదు' అని అన్నారు. శిక్షణ పొందిన వలంటీర్లు ప్రాథమిక స్థాయిలో విద్యార్థుల డ్రాప్ అవుట్ తగ్గింపు దిశగా పని చేయాలన్నారు. తాను కూడా సాధారణ వలంటీర్‌గా మీతో కలిసి వస్తానని చెప్పారు. కార్యక్రమానికి రిజిస్ట్రార్ ఆచార్య శ్రీనివాసరావు అధ్యక్షత వహించాచగా.. ఎన్ఎస్ఎస్ కోఆర్డినేటర్ ఆచార్య ఈసం నారాయణ, పింగిలి కళాశాల ప్రిన్సిపాల్, పాలక మండలి సభ్యుడు డాక్టర్ చంద్రమౌళి, కళాశాల విద్య అకాడమిక్ గైడెన్స్ ఆఫీసర్ డాక్టర్ డీ.టీ.చారి మాట్లాడారు. ఈ కార్యక్రమానికి సంబంధించిన మాడ్యుల్ పుస్తకం 'పిల్లల కోసం' ఆవిష్కరించారు. అసిస్టెంట్ రిజిస్ట్రార్ డాక్టర్ వల్లా పృథ్వీరాజ్ వందన సమర్పణ చేశారు. కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్లు డాక్టర్ రాంబాబు, సతీష్‌చంద్ర, సునీత, రాధిక, శ్రీదేవి తదితరులు పాల్గొన్నారు.




నిరాడంబరంగా అథ్లెటిక్ పోటీలు

హనుమకొండలోని జవహర్‌లాల్ నెహ్రూ స్టేడియంలో సోమవారం రాష్ట్రస్థాయి అథ్లెటిక్స్ పోటీలు నిరాడంబరంగా ప్రారంభమయ్యాయి. మొదటిరోజు పోటీలను 'కుడా' చైర్మన్ సుందర్‌రాజ్ యాదవ్ ప్రారంభించారు. రన్నింగ్, జావెలిన్ త్రో తదితర అంశాల్లో పోటీలు నిర్వహించారు.

- వివరాలు 8లో - వరంగల్‌స్పోర్ట్స్

ఓపెన్ స్కూల్ ఎంతో సులభమైంది



ఓపెన్ స్కూల్ అడ్మిషన్ల పోస్టర్, బ్రోచర్‌ను ఆవిష్కరిస్తున్న కలెక్టర్ సిక్తా పట్నాయక్

విద్యారణ్యపురి: సార్వత్రిక విద్య ద్వారా టెన్త్, ఇంటర్‌లో ప్రవేశాలు పొందాలని, ఓపెన్ స్కూల్ విద్య ఎంతో సులభమైందని కలెక్టర్ సిక్తా పట్నాయక్ అన్నారు. ఓపెన్ స్కూల్ ప్రాధాన్యతపై అవగాహనలో భాగంగా సోమవారం హనుమకొండ కలెక్టరేట్‌లోని తన చాంబర్‌లో ఓపెన్ స్కూల్ ఉమ్మడి వరంగల్ జిల్లా కోఆర్డినేటర్ మురాల శంకర్‌రావుతో కలిసి అడ్మిషన్ల పోస్టర్, బ్రోచర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా సిక్తా పట్నాయక్ మాట్లాడుతూ అందరికీ విద్య అందించాలన్నది రాష్ట్ర ప్రభుత్వం ఉద్దేశమన్నారు. మధ్యలో చదువును మానేసిన వారికి ఓపెన్ స్కూల్ ఓ వరం అని తెలిపారు. అడ్మిషన్లకు ఈ నెల 31వరకు అవకాశం ఉందని, ఆసక్తి ఉన్నవారు అడ్మిషన్లు పొందేందుకు అధ్యయన కేంద్రాల కోఆర్డినేటర్లను సంప్రదించాలన్నారు. ఓపెన్ స్కూల్ సిబ్బంది అవినాష్, రత్నాకర్ పాల్గొన్నారు.

పరుగు పందెంలో పాల్గొన్న బాలికలు



నిరాడంబరంగా 'అథ్లెటిక్స్' చాంపియన్‌షిప్

- హాజరైన 891 మంది క్రీడాకారులు
- మమ అనిపించిన నిర్వాహకులు
- నిరుత్సాహంగా వెనుదిరిగిన క్రీడాకారులు



మాట్లాడుతున్న 'కుడా' చైర్మన్ సుందర్‌రాజ్ యాదవ్

వరంగల్ స్పోర్ట్స్: హనుమకొండలోని జేఎన్‌ఎస్‌లో సోమవారం నిర్వహించిన తెలంగాణ రాష్ట్ర స్థాయి అథ్లెటిక్స్ చాంపియన్‌షిప్ పోటీలు క్రీడాకారుల్లో నిరుత్సాహం నింపాయి. క్రీడాకారుల్లో నూతనోత్తేజం నింపి, భవిష్యత్తులో మరిన్ని పతకాలు సాధించేలా సంకల్ప బలాన్ని అందించేందుకే చాంపియన్‌షిప్ నిర్వహిస్తుంటారు. అందుకే ప్రారంభోత్సవంతో పాటు ముగింపు వేడుకలకు ప్రముఖులను అతిథులుగా ఆహ్వానించి, వారి అమూల్య సందేశంతో పాటు పతకాలు అందిస్తారు. దీని వల్ల క్రీడాకారుల్లో స్ఫూర్తి కలుగుతుంది. అయితే అథ్లెటిక్స్ అసోసియేషన్ సోమవారం అవేమి పట్టించుకోలేదు. పోటీలను మమ అనిపించి ముగించడంతో పతకాలు అందుకున్న క్రీడాకారులు నిరుత్సాహంగా వెనుదిరిగారు. హనుమకొండ అథ్లెటిక్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో అండర్–14,16,18,20 విభాగాల్లో నిర్వహించిన రాష్ట్ర స్థాయి పోటీల్లో తెలంగాణలోని 32 జిల్లాల నుంచి 891 మంది పాల్గొన్నట్లు నిర్వాహకులు తెలిపారు. బాలబాలికలకు జావెలిన్‌త్రో, 100, 400 మీటర్ల పరుగు కేటగిరీల్లో నిర్వహించిన పోటీల ప్రారంభానికి 'కుడా' చైర్మన్ సంగంరెడ్డి సుందర్‌రాజ్ యాదవ్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సీఎం కేసీఆర్ క్రీడలకు అధిక ప్రాధాన్యం ఇస్తున్నారన్నారు. పట్టుదల, క్రమశిక్షణతో రాష్ట్ర, జాతీయ స్థాయిలో రాణించాలని క్రీడాకారులకు సూచించారు. కార్యక్రమంలో అథ్లెటిక్స్ అసోసియేషన్ బాధ్యులు సారంగపాణి, యుగేంధర్‌రెడ్డి, వెంకటేశ్వర్‌రెడ్డి, చంద్రమోహన్ గౌడ్, మహేందర్, సమ్మయ్య, మనోజ్, కోచ్‌లు శ్రీమాన్, అశ్విని, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

9నుంచి కేయూ ఎస్‌డీఎల్‌సీఈ పరీక్షలు

కేయూ క్యాంపస్: కాకతీయ యూనివర్సిటీ పరిధిలోని ఎస్‌డీఎల్‌సీఈ(దూర విద్యకేంద్రం) డిగ్రీ బీఏ, బీకాం, బీబీఏ, బీఎస్సీ కోర్సుల మొదటి, ద్వితీయ, ఫైనల్ ఇయర్ పరీక్షలు ఈనెల 9వ తేదీ నుంచి నిర్వహిచనున్నారు. ఈ మేరకు అన్ని ఏర్పాట్లు పూర్తిచేసినట్లు కేయూ పరీక్షల నియంత్రణాధికారి ఆచార్య పి.మల్లారెడ్డి, అదనపు పరీక్షల నియంత్రణాధికారి డాక్టర్ నరేందర్ సోమవారం తెలిపారు. డిగ్రీ కోర్సుల మొదటి సంవత్సరం పరీక్షలు ఈనెల 11, 17, 21, 24, 28, 31, సెప్టెంబర్ 4 వరకు, ద్వితీయ సంవత్సరం పరీక్షలు ఈనెల 10, 16, 19, 23, 26, 30, సెప్టెంబర్ 2, ఫైనల్ ఇయర్ పరీక్షలు ఈనెల 9, 14, 18, 22, 25, 29, సెప్టెంబర్ 1, 5 తేదీల్లో నిర్వహించనున్నారు. ఆయా తేదీల్లో పరీక్షలు మధ్యాహ్నం 2 నుంచి సాయంత్రం 5గంటల వరకు నిర్వహిస్తారు. మొదటి సంవత్సరంలో 4,547 మంది, ద్వితీయ సంవత్సరంలో 4,403 మంది, ఫైనల్ ఇయర్‌లో 5,343 మంది విద్యార్థులు పరీక్షలు రాయబోతున్నారు. ఆయా పరీక్షల నిర్వహణకు 13 కేంద్రాలను ఏర్పాటు చేశారు.



కొలువు కొట్టారు..

ఈ విజయధీరులు లక్ష్యానికి పట్టుదల, కష్టపడే తత్వం తోడైతే సాధించలేనిది లేదని నిరూపించారు. పగలు, రాత్రి..ఎండా, వాన.. నింగినేలా..అనే తేడా లేకుండా నిరంతరం కష్టపడ్డారు. పుస్తకాలతో కుస్తీ పట్టారు.. గ్రంథాలయాలతో దోస్తీ కట్టారు. పరీక్ష కాలం మొత్తం ఆకలి లేదు.. దప్పిక లేదు. ఉన్నది ఒక్కటే ధ్యాస కొలువు కొట్టాలి. ఒక్కరా ఇద్దరా.. ప్రతీ పోస్టుకు వందల మంది పోటీపడుతున్నారు. ఈ నేపథ్యంలో అక్షరాన్నే ఆయుధంగా మలుచుకున్నారు. నిరంతరం కుర్చీకే అంకితమై దాదాపు రోజులో సగ భాగం చదివారు. పరీక్షలో గురి చూసి లక్ష్యం విసిరి సఫలీకృతులయ్యారు. ఆదివారం వెలువడిన ఫలితాల్లో ఉమ్మడి వరంగల్ జిల్లాకు చెందిన పలువురు ఎస్సై పోస్టులకు ఎంపికయ్యారు. వీరిలో ఒక్కొక్కరిది ఒక్కొక్క నేపథ్యం. వీరి విజయగాథపై 'సాక్షి' ప్రత్యేక కథనం

అమ్మ ఆశయం నెరవేర్చిన పుత్రులు..

- పెద్దకుమారుడు కానిస్టేబుల్‌గా విధులు నిర్వర్తిస్తుండగా చిన్నకుమారుడు ఎస్సై పోస్టుకు ఎంపిక



మధు

నెక్కొండ: ఓ కొడుకు చంకలో.. మరో కొడుకు కడుపులో ఉండగా అనారోగ్యంతో భర్తను కోల్పోయినా తండ్రి లేనిలోటు రాకుండా సాకిందా తల్లి.. ఆమె కష్టానికి కుమారులు ప్రతిఫలం అందించారు. పెద్దకుమారుడు కానిస్టేబుల్‌గా విధులు నిర్వర్తిస్తుండగా చిన్న కుమారుడు తాజాగా విడుదలైన ఫలితాల్లో ఎస్సై పోస్టుకు ఎంపికై ఆమె ఆశయం నెరవేర్చారు. వరంగల్ జిల్లా నెక్కొండ మండలం దీక్షకుంట్లకు చెందిన అనంతగిరి రవి 30 ఏళ్ల క్రితం మృతి చెందారు. అతడి భార్య రమకు అప్పటికే కొడుకు సిద్ధార్థ ఉండగా మరో కొడుకు (7 నెలల గర్భం)ను మోస్తోంది. భర్తలేని లోటును దిగమింగుకుంటూ ఇద్దరిని చదివించింది. ఈ క్రమంలో సిద్ధార్థ, మధు 2019లో సివిల్ కానిస్టేబుల్ పరీక్ష రాయగా సిద్ధార్థ ఎంపికయ్యాడు. దీంతో తల్లి ఆశయం.. సోదరుడి స్ఫూర్తితో మధు 2022లో రైల్వే శాఖలో ఉద్యోగం సాధించి, విధులు నిర్వర్తిస్తున్నాడు. కాగా, అంతకుముందే ఎస్సై పరీక్ష రాశారు. ఈ క్రమంలో ఈ నెల 6వ తేదీన వెలువడిన ఫలితాల్లో సివిల్ ఎస్సైగా ఎంపికయ్యారు.

అన్నయ్య స్ఫూర్తిగా..

- సివిల్ ఎస్సై పోస్టుకు అర్చన ఎంపిక



అర్చన

దామెర: మండలంలోని పసరగొండ గ్రామానికి చెందిన చెందిన ఆకుల శ్రీశైలం, లక్ష్మి దంపతుల కూతురు అర్చన సివిల్ ఎస్సై పోస్టుకు ఎంపికయ్యారు. శ్రీశైలం, లక్ష్మి దంపతులకు కుమారుడు గణపతి, కూతురు అర్చన ఉంది. గణపతి 2018–19 బ్యాచ్‌లో రిజర్వ్ ఎస్సైగా ఎంపికై ప్రస్తుతం మామునూర్ బెటాలియన్‌లో విధులు నిర్వహిస్తున్నారు. అర్చన.. ఎన్జీరంగా వ్యవసాయ విశ్వవిద్యాలయంలో అగ్రికల్చర్ బీఎస్సీ పూర్తిచేసింది. అనంతరం ఎస్సై పరీక్ష రాశారు. ఆదివారం వెలువడిన ఫలితాల్లో సివిల్ ఎస్సై పోస్టుకు ఎంపికయ్యారు. అన్నయ్యను స్ఫూర్తిగా తీసుకుని ఎస్సై పరీక్ష రాసి ఎంపికయ్యానని అర్చన తెలిపారు.

తల్లిదండ్రుల కృషితో సాధించా..



కొండ సురేష్

నర్సింహులపేట: నర్సింహులపేట మండలం కొమ్ములవంచ గ్రామానికి చెందిన కొండ వెంకన్న, పద్మ దంపతుల కుమారుడు సురేష్ ఆదివారం వెలువడిన ఫలితాల్లో సివిల్ ఎస్సై పోస్టుకు ఎంపికయ్యారు. తాను ఎలాంటి కోచింగ్ తీసుకోలేదన్నారు. లక్ష్యం విధించుకుని నిరంతరం చదివానన్నారు. కాగా, నెల క్రితం కాచిగూడలో రైల్వే గ్రూప్–డీ ఉద్యోగిగా జాయిన్ అయ్యానని తెలిపారు. తల్లిదండ్రుల కృషితోనే తాను సివిల్ ఎస్సై ఉద్యోగం సాధించానన్నారు.

కష్టపడి చదివి..లక్ష్యం సాధించి

- ఎస్సై పోస్టుకు గోవర్ధన్ ఎంపిక



గోవర్ధన్

సంగెం: మండలంలోని వంజరపల్లి గ్రామానికి చెందిన పొన్నాల సుగుణ, జనార్దన్ దంపతుల చిన్న కుమారుడు గోవర్ధన్ ఎస్సై ఉద్యోగం సాధించారు. 2018లో టీఎస్ఎస్‌పీ కొండాపూర్‌లోని 8వ బెటాలియన్‌లో కానిస్టేబుల్‌గా విధుల్లో చేరాడు. అయితే కానిస్టేబుల్ ఉద్యోగానికి సంతృప్తి చెందని గోవర్ధన్.. నిరంతరం కష్టపడి పట్టుదలతో చదివి ఎస్సై పోస్టుకు ఎంపికయ్యారు. కాగా, గోవర్ధన్‌ను సర్పంచ్ పెంతల స్రవంతి అనిల్, గ్రామస్తులు అభినందించారు.

కర్షక కుటుంబం నుంచి ఖాకీ వనంలోకి ..

- ఎస్సై పోస్టుకు కూన వినయ్ ఎంపిక
- తల్లిదండ్రులు, గ్రామస్తుల ఆనందం



కూన వినయ్

పాలకుర్తి: పాలకుర్తి మండలం ఈరవెన్ను గ్రామంలోని వ్యవసాయ కుటుంబానికి చెందిన కూస హైమ–మల్లయ్య దంపతుల కుమారుడు వినయ్ ఎస్సై పోస్టుకు ఎంపికయ్యారు. ఆదివారం వెలువడిన ఫలితాల్లో వినయ్ ప్రతిభ చూపారు. గ్రామంలోని ప్రభుత్వ పాఠశాలలో చదివి కష్టపడి ఉద్యోగం సాధించినట్లు వినయ్ తెలిపారు. తల్లిదండ్రుల సహకారంతో తాను ఈ కొలువు సాధించినట్లు తెలిపారు. వ్యవసాయ కుటుంబంలో జన్మించి ఎస్సైగా ఎంపికైనందుకు ఆనందంగా ఉందన్నారు. కాగా, తన కుమారుడు ఎస్సై కావడం సంతోషంగా ఉందని తల్లిదండ్రులు పేర్కొన్నారు. అలాగే, వినయ్.. ఎస్సై పోస్టుకు ఎంపిక కావడంపై గ్రామస్తులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. కాగా, వినయ్ అంతకుముందే రెండు ప్రభుత్వ ఉద్యోగాలకు ఎంపికయ్యారు. సెంట్రల్ ఇండస్ట్రియల్ సెక్యూరిటీ ఫోర్స్(సీఐఎస్ఎఫ్), రైల్వే గ్రూప్–డీలో ఉద్యోగాలు సాధించారు. ప్రస్తుతం రైల్వే గ్రూపు డీలో విధులు నిర్వర్తిస్తూ ఎస్సై పోస్టుకు ఎంపికయ్యారు.

గ్రంథాలయంలో ప్రిపరేషన్..

- ఎస్సై పోస్టుకు రఘుబాబు ఎంపిక



రఘుబాబు

దుగ్గొండి: మండలంలోని మల్లంపల్లి గ్రామానికి చెందిన బూర నారాయణ, శోభారాణి దంపతులది నిరుపేద కుటుంబం. కూలీకి వెళ్తేగాని పూటగడవదు. అలాంటి వారి ఇంట్లో వెలుగులు నిండాయి. ఆ దంపతుల కుమారుడు రఘుబాబు ఎస్సై పోస్టుకు ఎంపికయ్యారు. రఘుబాబు టెన్త్ వరకు స్థానికంగా ఉన్న ప్రభుత్వ పాఠశాలలోనే చదివాడు. మాసాబ్‌ట్యాంక్‌లోని ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో డిప్లొమా చేశాడు. బీటెక్ చదవడానికి డబ్బు సరిపడలేదు. దీంతో ఓపెన్ డిగ్రీ చేశాడు. ఈ సమయంలోనే మండల కేంద్రంలోని గ్రంథాలయంలో చదువుకునే వాడు. ఎస్సై కావాలనే పట్టుదలతో ముందుకు సాగి మొదటి ప్రయత్నంలోనే కొలువు సాధించాడు. ఎస్‌పీఎఫ్ విభాగంలోఎస్సై ఉద్యోగం సాధించాడు. దీంతో నిరుపేద ఇంట్లో వెలుగు నిండింది. ఊరంతా సంబురాలు చేసుకుంది.

ఏఎస్‌ఐ కొడుకు ఎస్సై..

- రెండో ప్రయత్నంలో సివిల్ ఎస్సై పోస్టుకు ఎంపికైన దిలీప్



దిలీప్

కాశిబుగ్గ: ఏఎస్ఐ కొడుకు ఎస్సై కానున్నారు. ఆదివారం ప్రకటించిన ఎస్సై ఫలితాలలో వరంగల్ కాశిబుగ్గ శాంతినగర్‌కు చెందిన లింగాల దిలీప్ సివిల్ ఎస్సై ఉద్యోగానికి ఎంపికయ్యారు. శాంతినగర్‌కు చెందిన లింగాల మోహన మురళి, స్వరూపరాణి దంపతులకు ఇద్దరు కుమారులు, ఒక్క కూతురు ఉన్నారు. దిలీప్ తండ్రి మోహన మురళి నర్సంపేట పోలీస్ స్టేషన్‌లో ఏఎస్‌ఐగా విధులు నిర్వర్తిస్తున్నాడు. కాగా, దిలీప్ రెండో ప్రయత్నంలో సివిల్ ఎస్సైకు ఎంపికయ్యారని తండ్రి మోహన మురళి తెలిపారు. కాగా, దిలీప్‌ను 'సాక్షి' పలకరించంగా తన అన్న, చెల్లి, బావ ప్రోత్సాహంతో ఎస్సై ఉద్యోగం సాధించానని తెలిపారు. కార్పొరేటర్ నరేంద్రకుమార్, జాగృతి నియోజకవర్గ ఇన్‌చార్జ్ పెండ్యాల సోనిబాబు, పలువురు.. దిలీప్‌కు శుభాకాంక్షలు తెలిపారు.

నాడు సైనికాధికారి..

- నేడు పోలీసు అధికారి..
- సివిల్ ఎస్సై పోస్టుకు రాజేష్ ఎంపిక



రాజేష్

పరకాల: దేశాభిమానం ఆయనను 17 సంవత్సరాల వయస్సులోనే సైనికుడు అయ్యేలా చేసింది. సైనికుడిగా..సైనికాధికారిగా 18 ఏళ్లు దేశ సరిహద్దులలో పనిచేశారు. అనంతరం ప్రజలలో ఉంటూ సేవ అందించాలని భావించి నిరంతరం కష్టపడి చదివి అనుకున్న లక్ష్యం చేరుకున్నారు. ఆయనే పరకాల పట్టణానికి చెందిన రిటైర్డ్ సైనికాధికారి పిట్ట రాజేష్. ఆదివారం వెలువడిన ఫలితాల్లో సివిల్ ఎస్సై పోస్టుకు ఎంపికయ్యారు. దీంతో కుటుంబ సభ్యులు, స్నేహితులు, గ్రామస్తులు ఆనంద సాగరంలో మునిగారు.

పట్టుదలతో చదివి..

- ఎస్సై ఉద్యోగానికి ఎంపికైన హేమలత



బొల్లెబోయిన హేమలత

కొత్తగూడ : కొత్తగూడ మండలం ఓటాయి గ్రామానికి చెందిన బొల్లెబోయిన హేమలత ఎస్సై పోస్టుకు ఎంపికయ్యారు. నిరుపేద వ్యవసాయ కుటుంబానికి చెందిన బొల్లెబోయిన పద్మ, కుమార స్వామి దంపతుల పెద్ద కూతురు హేమలత చిన్నప్పటి నుంచి ఆర్థిక ఇబ్బందులకు చలించిపోయేది. తల్లిదండ్రులకు చేదోడు వాదోడుగా ఉంటూనే పట్టుదలతో చదువు కొనసాగించింది. ఈ క్రమంలో ఎస్సై ఉద్యోగానికి ఎంపికైంది. ఎస్సై పోస్టుకు ఎంపికైనందుకు సంతోషంగా ఉందన్నారు. కాగా, తమ కూతురు ఎస్సైగా ఎంపిక కావడం చాలా ఆనందంగా ఉందని తల్లిదండ్రులు పద్మ, కుమారస్వామి తెలిపారు.

అవాంతరాలు ఎదురైనా..

- లక్ష్యం చేరుకున్న మహేష్
- సివిల్ ఎస్సై పోస్టుకు ఎంపిక



మహేష్

పాలకుర్తి : మండలంలోని బమ్మెర గ్రామంలో నిరుపేద కుటుంబానికి చెందిన మహేష్ సివిల్ ఎస్సై పోస్టుకు ఎంపికయ్యారు. శివరాత్రి లక్ష్మి, సోమయ్య దంపతుల కుమారుడు మహేష్ నిరంతరం కష్టపడి చదివి లక్ష్యం చేరుకున్నారు.ఈ ప్రయత్నంలో ఎన్ని అవాంతరాలు ఎదురైనా ముందుకు సాగి ఉన్నత శిఖరాలకు చేరుకున్నారు. కాగా, మహేష్ ఎంపికపై గ్రామస్తులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు.

సెలవు పెట్టి.. నౌకరి కొట్టి!

- ఎస్సై పోస్టుకు కొత్తూరు యువకుడు బండారి శివ ఎంపిక
- ఆనందంలో తల్లిదండ్రులు, గ్రామస్తులు



శివ

ఖానాపురం : కష్టపడి చదివాడు.. కోరుకున్న కొలువు సాధించాడు. ప్రస్తుతం విధులు కొనసాగిస్తున్నాడు. అయినా ఏదో వెలితి. ఇంతకంటే మెరుగు కొలువు సాధించాలనే లక్ష్యం విధించుకున్నాడు. దీనికి విధులు అడ్డుగా వస్తున్నాయని సెలవు తీసుకున్నాడు.. అనంతరం కష్టపడి చదివి అనుకున్న లక్ష్యం సాధించి పలువురికి ఆదర్శంగా నిలిచారు. ఖానాపురం మండలం కొత్తూరు గ్రామానికి చెందిన బండారి మల్లయ్య, ఐలమ్మ దంపతుల కుమారుడు శివ 2016లో సివిల్ కానిస్టేబుల్ ఉద్యోగం సాధించాడు. ప్రస్తుతం గంగారం పోలీస్‌స్టేషన్‌లో విధులు నిర్వహిస్తున్నాడు. ఈ క్రమంలో తనతో పాటు 2016లో కానిస్టేబుల్ ఉద్యోగానికి ఎంపిక కాని వారు మరో ప్రయత్నంలో ఎస్సై ఉద్యోగం సాధించారు. దీంతో తాను కూడా ఎస్సై ఉద్యోగం సాధించాలనే పట్టుదలతో ముందుకు సాగాడు. చదువు కోసం ఇబ్బందులు ఏర్పడుతున్నాయనే కారణంతో మూడు నెలలు విధులకు సెలవు తీసుకున్నారు. హనుమకొండలో ఓ గదిలో ఉంటూ సెంట్రల్ లైబ్రరీలో చదువుకున్నాడు. ఆదివారం వెలువడిన ఫలితాల్లో 242 మార్కులు సాధించి ఎస్సై పోస్టుకు ఎంపికయ్యారు. దీంతో ఆ కుటుంబంలో ఆనందం నెలకొంది. కాగా, గ్రూప్–1 సాధించడమే లక్ష్యమని, ప్రిలిమ్స్ అర్హత సాధించినట్లు శివ తెలిపారు.

గ్రూప్ ఆఫ్ టెంపుల్స్‌గా పరిగణించాలి



సమావేశంలో పాల్గొన్న అర్చక ఉద్యోగ జేఏసీ నాయకులు, అర్చకులు

హన్మకొండ కల్చరల్: గ్రామీణ ప్రాంతాల్లోని దూప దీప నైవేద్య (డీడీఎన్) అర్చకులకు ఉద్యోగ భద్రత కల్పించడానికి డీడీఎన్ స్కీం అనే పదాన్ని తొలగించి పూర్తిస్థాయిలో దేవాదాయ శాఖలో గ్రూపు ఆఫ్ టెంపుల్స్ గా పరిగణించాలని తెలంగాణ రాష్ట్ర అర్చక ఉద్యోగ జేఏసీ చైర్మన్ గంగు ఉపేంద్రశర్మ పేర్కొన్నారు. వేయిస్తంభాల దేవాలయం ఆవరణలోని కుడా గార్డెన్స్‌లో సోమవారం రాష్ట్ర డీడీఎన్ అర్చకుల కార్యవర్గ సమావేశాన్ని నిర్వహించారు. డీడీఎన్ రాష్ట్ర అధ్యక్షుడు నిట్టూరి సతీష్‌శర్మ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో ముందుగా ప్రజా గాయకుడు గద్దర్‌కు శ్రద్ధాంజలి ఘటించారు. సమావేశంలో గంగు ఉపేంద్రశర్మ, డీడీఎన్ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ పిన్నా మోహన్‌శర్మ, అర్చక వెల్ఫేర్ బోర్డు సభ్యుడు జక్కపురం నారాయణస్వామి, గౌరవాధ్యక్షుడు ఆంజనేయచారి, వివిధ జిల్లాల అధ్యక్ష, కార్యదర్శులు పాల్గొని పలు తీర్మానాలు చేశారు. ప్రభుత్వం డీడీఎన్ అర్చకులకు వేతనం రూ.6వేల నుంచి రూ.10వేలకు పెంచడంపై హర్షం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో రాష్ట్ర కార్యవర్గ సభ్యులు నవీన్‌కుమార్‌చారి, బ్రహ్మచారి, నర్సింహచారి, రావులచారి, నాగరాజ్, సంపత్‌కుమార చారి, ప్రభాకరాచారి, బాలరాజు పాల్గొన్నారు.

స్టైఫండ్ పెంచాల్సిందే..

- ఆయుర్వేద వైద్య విద్యార్థుల విధుల బహిష్కరణ
- ఆస్పత్రి ఎదుట ధర్నా

కాశిబుగ్గ: ప్రభుత్వం తమకు స్టైఫండ్ పెంచాల్సిందేనని వరంగల్ ప్రభుత్వ ఆయుర్వేద వైద్య విద్యార్థులు డిమాండ్ చేశారు. మూడో రోజు సోమవారం వరంగల్ ప్రభుత్వ బోధన వైద్యశాల, వైద్య కళాశాల ఎదుట విద్యార్థులు ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు విద్యార్థులు మాట్లాడుతూ.. రాష్ట్ర వ్యాప్తంగా ఐదు రోజులుగా ఆయుష్ విద్యార్థులు కళాశాలలు, వైద్యశాలల ఎదుట నిరసనలు, ధర్నాలు నిర్వహిస్తున్నా.. ప్రభుత్వం స్పందించడం లేదన్నారు. ధర్నాకు హాస్పటల్ డెవలప్‌మెంట్ కమిటీ మెంబర్ డాక్టర్ బాల్నె సాంబమూర్తి, డాక్టర్ వి.మోహన్‌రావు, డాక్టర్ రవీందర్‌లు మద్దతు పలికారు. ఈ ధర్నాలో ఆయుర్వేద హౌస్ సర్జన్లు నవీన్, కిషోర్, హిమజ, మహేశ్వరి, మొదటి, ఫైనలియర్ వైద్య విద్యార్థులు పాల్గొన్నారు.

నేడు 'అకుట్' సర్వసభ్య సమావేశం

కేయూ క్యాంపస్: కాకతీయ యూనివర్సిటీ అధ్యాపకుల సంఘం (అకుట్) సర్వసభ్య సమావేశాన్ని నేడు(మంగళవారం) మధ్యాహ్నం 3 గంటలకు పరిపాలనాభవనంలోని సెనెట్‌హాల్‌లో నిర్వహించనున్నారు. 8 నెలల క్రితం ఎన్నికైన అకుట్ వివిధ సమస్యలపై యూనివర్సిటీ అధికారులకు వినతిపత్రాలు ఇచ్చారు. అతర్వాత అధ్యక్షుడు శ్రీనివాస్ అకుట్ కార్యకలాపాలకు దూరంగా ఉంటున్నారు. ఇటీవల అకుట్ కార్యవర్గ సమావేశానికి కూడా హాజరుకాలేదు. కాని మొదటి నుంచి కూడా అకుట్ జనరల్‌సెక్రటరీ ఇస్తారి మాత్రం క్రియాశీలకంగా వ్యవహరిస్తున్నారు. అయితే ఇస్తారి చేసి ఓ ఫిర్యాదుపై సంబంధిత ఉన్నతాధికారులు యూనివర్సిటీ అధికారులను వివరణకోరారు. దీంతో అకుట్ లెటర్‌ప్యాడ్‌తో ఎలా ఫిర్యాదు చేస్తారని ఇస్తారిపై ముగ్గురు ఆచార్యులు ఆగ్రహంగా ఉన్నట్లు సమాచారం. యూనివర్సిటీలో అకుట్‌ను వీసీ నిర్వీర్యం చేసేందుకు ప్రయత్నిస్తున్నట్లు చర్చ జరుగుతోంది. . నేడు జరిగే అకుట్ సర్వ సభ్యసమావేశంలో జనరల్‌సెక్రటరీ ఇస్తారి సమస్యలు, యూనివర్సిటీ అధికారులు అనుసరిస్తున్న తీరుపై ప్రస్తావించే అవకాశాలు ఉన్నాయి.

విశ్వవిద్యాలయాలను పట్టించుకోని ప్రభుత్వాలు

- ఎస్‌ఎఫ్‌ఐ రాష్ట్ర అధ్యక్షుడు ఆర్.ఎల్.మూర్తి



సమావేశంలో మాట్లాడుతున్న ఆర్‌ఎల్ మూర్తి

కేయూ క్యాంపస్: దేశంలోని విశ్వవిద్యాలయాలను ప్రభుత్వాలు పట్టించుకోవడంలేదని భారత విద్యార్థి ఫెడరేషన్ (ఎస్ఎఫ్ఐ) రాష్ట్ర అధ్యక్షుడు, ఉస్మానియా యూనివర్సిటీ రీసెర్చ్ స్కాలర్ ఆర్ఎల్ మూర్తి అన్నారు. సోమవారం కాకతీయ యూనివర్సిటీలోని హిస్టరీ సెమినార్ హాల్లో ఎస్ఎఫ్ఐ కేయూ కమిటీ సమావేశంలో ఆయన ముఖ్య అతిథిగా మాట్లాడారు. పాలక ప్రభుత్వాలు దేశంలోని విశ్వవిద్యాలయాలను ధ్వంసం చేస్తున్నాయని ఆరోపించారు. సెల్ఫ్ ఫైనాన్స్ కోర్సులను ప్రవేశపెట్టి విశ్వవిద్యాలయలను ప్రైవేటుపరం చేస్తున్నారని అన్నారు. ఎస్ఎఫ్‌సీల్లో చేరిన ప్రతి విద్యార్థికి హాస్టల్ వసతి కల్పించాలని డిమాండ్ చేశారు. ఇకపై ఏ రెగ్యులర్ కోర్సును ఎస్ఎఫ్‌సీగా మార్చొద్దని డిమాండ్ చేశారు. విద్యార్థుల నుంచి అత్యంత ఎక్కువ ఫీజులను వసూలు చేస్తూ యూనివర్సిటీలో కనీసం హాస్టల్ వసతి కల్పించపోవడం నాణ్యమైన భోజనం పెట్టకపోవడం విద్యార్థులను ఇబ్బందులకు గురిచేయటమేనని విమర్శించారు. రీసెర్చ్ స్కాలర్స్‌కి నేషనల్ ఫెల్లోషిప్స్ అందించాలని డిమాండ్ చేశారు. సమావేశంలో ఎస్ఎఫ్ఐ హనుమకొండ జిల్లా అధ్యక్ష కార్యదర్శులు మిశ్రీన్ సుల్తానా, మంద శ్రీకాంత్, కేయూ అధ్యక్షుడు హాతిరాం, బాధ్యులు సాయికృష్ణ, స్టాలిన్, నవీన్, ఉదయ్, ప్రవళిక, సంధ్య, రక్షిత, వర్ష, నరసింహ, వినోద్, జగన్ తదితరులు పాల్గొన్నారు.

సేంద్రియ పద్ధతులతో భూసార పరిరక్షణ

- కేయూ వీసీ తాటికొండ రమేష్

కేయూ క్యాంపస్: సేంద్రియ వ్యవసాయ పద్ధతులతోనే 'భూసార పరిరక్షణ' సాధ్యమని కాకతీయ విశ్వవిద్యాలయ వీసీ ఆచార్య తాటికొండ రమేష్ అన్నారు. కేయూ మైక్రో బయాలజీ విభాగ అధిపతి డాక్టర్ శ్రీనివాస్ ముంజం అధ్యక్షతన రెండు రోజులపాటు నిర్వహించనున్న శిక్షణ కార్యక్రమాన్ని సోమవారం వీసీ ప్రారంభించి, మాట్లాడారు. భారత ప్రభుత్వ అగ్రికల్చరల్, ఫార్మర్స్ మంత్రిత్వ శాఖ వారి నాగపూర్ రీజినల్ సెంటర్ ఫర్ ఆర్గానిక్ అండ్ న్యాచురల్ ఫార్మింగ్, కాకతీయ విశ్వవిద్యాలయ మైక్రో బయాలజీ విభాగం సహకారంతో నిర్వహిస్తున్న శిక్షణలో 'ట్రైనింగ్ ఫర్ ఎక్స్‌టెన్షన్ స్టాఫ్ ఆన్ ఆర్గానిక్ అండ్ న్యాచురల్ ఫార్మింగ్' అంశంపై ఆయన మాట్లాడారు. సేంద్రియ ఎరువుల వినియోగంతో భూసారం పెరుగుతుందన్నారు కోఆర్డినేటర్ డాక్టర్ ప్రవీణ్ ఊట్ల విశ్రాంత ఆచార్యులు ఎస్ఎం రెడ్డి, అడ్జెంక్ట్ ఆచార్యులు రాంరెడ్డి, కేయూ మాజీ రిజిస్ట్రార్ ఆచార్య శంకరయ్య పాల్గొన్నారు.

విశ్వబ్రాహ్మణులు సేవాస్ఫూర్తితో పనిచేయండి

- తెలంగాణ సాహిత్య అకాడమీ కార్యదర్శి బాలాచారి



పూలే సాహిత్యాన్ని ఆవిష్కరిస్తున్న బాలాచారి

హన్మకొండ చౌరస్తా: విశ్వబ్రాహ్మణ, విశ్వకర్మ జాతికి మహోన్నతమైన చరిత్ర ఉందని, సామాజిక సేవా కార్యక్రమాలు నిర్వహించాలని తెలంగాణ రాష్ట్ర సాహిత్య అకాడమీ కార్యదర్శి నామోజు బాలాచారి అన్నారు. హనుమకొండ అలంకార్ సమీపంలోని ఓ ఫంక్షన్‌హాల్‌లో సోమవారం 'మహాత్మ జ్యోతిరావు పూలే' సాహిత్య పుస్తక ఆవిష్కరణ కార్యక్రమం నిర్వహించారు. తెలంగాణ విశ్వబ్రాహ్మణ, విశ్వకర్మ మాతృసంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి అధ్యక్షతన జరిగిన కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన బాలాచారి మాట్లాడారు. విశ్వబ్రాహ్మణులు సేవకు మారుపేరని, నిత్యం చేతివృత్తులు, కుటీర పరిశ్రమలు ఆదుకునేలా నాయకులు పనిచేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో సంఘం బాధ్యులు రవీంద్రచారి, సదానందం, వీరన్న, మోహన్, చక్రపాణి, సురేష్, మోహన్‌రావు, శ్రీనివాస్, సత్యనారాయణ, ప్రకాశం, నాగారాజారావు, రాధాకృష్ణ, విష్ణువర్ధన్, జగదీశ్వర్, రమేష్‌బాబు, సతీష్ తదితరులు పాల్గొన్నారు.